# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **గ్రీన్ ఎనర్జీ రంగంలో ప్రాజెక్టుల అభివృద్ధిలో సింగపూర్ సహకారం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **అమృత్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**
3. **రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు కోరారు.**
5. **ప్రపంచ కాలేయ వ్యాధుల అవగాహన దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

గ్రీన్ ఎనర్జీ రంగంలో ప్రాజెక్టుల అభివృద్ధిలో సింగపూర్ సహకారం అవసరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సింగపూర్‌లో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య పరిశ్రమల శాఖలోని మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి టాన్ సీ లాంగ్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారుల బృందం ఈరోజు సమావేశమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులు తదితర రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ముఖ్యమంత్రికి తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో నవంబరు నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

--------------------------

రాష్ట్రవ్యాప్తంగా అమృత్ పథకం ద్వారా అన్ని నగరపాలక సంస్థల్లో వచ్చే మూడేళ్లలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. విజయవాడలో మంత్రి ఈరోజు మాట్లాడుతూ, విజయవాడ నగరపాలక సంస్థ ద్వారా ప్రతిరోజు 16 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. విజయవాడ నగర నీటి సరఫరా వ్యవస్థపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్'లో అభినందించడం గర్వకారణమని నగరంలో నీటి నిర్వహణ బాగుందని

ప్రధానమంత్రి వ్యాఖ్యానించారని చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, ఇతర అధికారులు, సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా నిండ్రలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయనున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొంటూ..

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు కోరారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం నందిగాం మండలం నరేంద్రపురంలో రైతులకు డ్రోన్లను మంత్రి ఈ రోజు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 80 శాతం రాయితీతో రైతులకు డ్రోన్లను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. వ్యవసాయంలో కూలీల కొరత, సమయాన్ని ఆదా చేయడంలో భాగంగా ద్రవ ఎరువులు పిచికారీ కోసం ఈ డ్రోన్లను వినియోగించవచ్చని తెలిపారు.

---------------------------

సింగపూర్ అభివృద్ధి చెందిన తీరును స్ఫూర్తిగా తీసుకోవాలని ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సింగపూర్‌లో తెలుగు డయాస్పోరా వాలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ రోజు మాట్లాడారు. ఏ దేశం వెళ్లినా తొలుత తెలుగువాళ్లను కలవాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు వల్ల అభివృద్ధి వేగవంతమైందని చెప్పారు. రాజకీయాల కంటే అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చేలా ఆ దేశం నుంచి స్ఫూర్తి పొందాలని ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు.

---------------------------

యువతను కీడల్లోనూ ప్రోత్సహించాల్సిన అవసరముందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వి రాజశేఖర్ బాబు అన్నారు. మోడరన్ పెంటథలాన్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 9వ ట్రయాథ్లన్, రెండవ టెట్రాథలాన్ రాష్ట్ర స్థాయి పోటీలను కృష్ణా జిల్లా, పెనమలూరులో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విజేతలకు ఆయన ఈరోజు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,

వాయిస్ .. 26 సెకన్లు

---------------------------

ఈ రోజు ప్రపంచ కాలేయ వ్యాధుల అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ-డబ్ల్యూహెచ్ఓ పిలుపు మేరకు ప్రతి ఏటా జూలై 28వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ వ్యాధికి గురైన వారికి కాలేయం నిదానంగా దెబ్బతింటుంది. ప్రస్తుతం ఈ వ్యాధి నివారణకు హెపటైటిస్ ఎ,బి టీకాలు అందుబాటులో ఉన్నాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. సరైన ఆహారపు అలవాట్లు, తగిన

వ్యాయామం చేయడం ద్వారా ఈ వాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు.

----------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో సెప్టెంబరు 22 నుంచి దసరా మహోత్సవాలను నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ తెలిపారు. విజయవాడలో 2025 దసరా ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను ఆలయ వైదిక కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఈరోజు ఆవిష్కరించారు. అనంతరం శీనా నాయక్ పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్... 30 సెకన్లు

----------------------------

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలోని నేలపాడు హైకోర్టు భవనంలోని కోర్టు హాల్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆయనతో ప్రమాణం చేయించారు. కాగా జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణ స్వీకారంతో రాష్ట్ర హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరింది. జస్టిస్ దేవానంద్ 2028 ఏప్రిల్ 13 వరకు పదవీలో కొనసాగుతారు.

----------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 469 పాయింట్ల నష్టంతో 40 వేల 993 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 127 పాయింట్ల నష్టంతో 24 వేల 710 వద్ద ట్రేడవుతోంది.

----------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పడమటి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..17 సెకన్లు

======================